# పిలుపు

కాకాని కమల

సమయం....

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటుతూంది.

ఏప్రిల్ మాసం....

బయట ఎండ ఎర్రగా వుంది.

ఎవరో వీధి తలుపు మీద దబదబ కొడుతున్నట్లనిపించి, గాఢనిద్రలోంచి వులిక్కిపడి గభాలున లేచి వీధి తలుపులు తెరిచాడు రవీంద్ర

ఎదురుగా-

తల వెంట్రుకల్ని జారుముడి వేసుకొని, చేతిలో చిన్న సంచితో గుమ్మంలో నిల్చున్న తల్లిని చూడగానే అనందంతో రవీంద్ర కంఠంలో ఒక చిన్న కేక....

ఉద్వేగంతో తల్లిని కౌగలించుకొన్నంత పని చేసి, చప్పన ఆవిడ చేతిలోని బ్యాగు అందుకొంటూ-

"బావున్నావా అమ్మా?"

ఆ మాటలు అంటున్నప్పుడు అతని కంఠంలో తేనె చిందినట్టు అపేక్ష చిందులు తొక్కింది. చల్లగాలికి- పండుటాకు కదిలినట్లు సీతమ్మ చిరునవ్వు నవ్వింది.

ప్రేమగా కొడుకు చెంపలు నిమిరి ముద్దు పెట్టుకొంటూ- "బావున్నావురా...."అంది అలసటగా

మంచి ఎండలో రావటంతో ఆవిడ మొగం కొద్దిగా వడలినట్టు అయ్యింది.

ముడతలు పడ్డ ఆవిడ నుదుటి నుంచి చెమట బిందువులు చుక్కచుక్కగా జారుతున్నాయ్.

ముగ్గు బుట్టలా పండిన జుత్తు వెచ్చగా వీచే వడగాలికి అటూ ఇటూ చెదురుతూంది.

సీతమ్మ చాలా అభిమానధనురాలు.

చిన్నమాట పడాలంటే ఆవిడ ప్రాణం పోయినంతగా విలవిల్లాడిపోతుంది.

సీతమ్మ భర్త గతించి ఆరుసంవత్సరాలు అయ్యింది.

ఇద్దరే కొడుకులు.

సురేంద్ర. రవీంద్ర.

సంవత్సరంలో ఇద్దరి దగ్గరా ఆరేసి నెలలపాటు వుంటుంది.

అయితే, చిన్న కోడలుతో మాట పట్టింపు వచ్చి ఏణ్ణర్థంగా రవీంద్ర ఇంటికి రాకుండా పెద్ద కొడుకు సురేంద్ర దగ్గరే వుంటోంది.

రవీంద్ర రెండు మూడు ఉత్తరాలు వ్రాశాడు తల్లిని రమ్మని. ఆవిడ రాలేదు.

స్వయంగా వెళ్ళి పిలిచేడు.

ఎందుకో ....సీతమ్మ సుముఖత చూపలేదు.

"పోనీలేరా ఈ వయసులో ఆవిడ్ని ఇబ్బంది పెట్టట మెందుకు. అమ్మ ఎక్కడ వుంటే మాత్రం ఏం? నీకు చూడాలనిపించినప్పుడల్లా చూసి వెడుతూవుండు" అన్నాడు సురేంద్ర.

దాంతో తల్లిని గట్టిగా నిర్బంధించలేకపోయాడు రవీంద్ర.

ఏవో చిన్నచిన్న కుటుంబ కలహాలు, అత్తకోడళ్ళ తగాదాలు.

తల్లి ఇంక తన ఇంటి గుమ్మం తొక్కదనే అనుకున్నాడు రవీంద్ర.

అటువంటిది చాలా రోజుల తరువాత తలవని తలంపుగా తన ఇంటికి వచ్చిన తల్లిని చూస్తుంటే రవీంద్రకి ఆనందంతో నోటమాట రావటంలేదు.

"అమ్మా! ఇంత ఎండలో కబురైనా లేకుండా వచ్చావేంటమ్మా? ఉత్తరం వ్రాస్తే నేను బస్సు స్టాండుకు వచ్చేవాడిని కదా? ముందు ఇలా కూర్చో....." అంటు తల్లిని చెయ్యిపట్టుకొని సోఫాలో కూర్చోపెట్టి, ఎ.సి. ఆన్ చేశాడు.

సీతమ్మ అలసటగా పయిట చెంగుతో నుదుటి చెమట తుడుచుకుంది.

కళ్ళల్లో పల్చగా నీళ్ళు చిప్పిల్లుతుంటే కొడుకు కేసి ఆప్యాయంగా చూస్తూ-

"ఏమిటోరా!నిన్ను చూడాలనిపించింది. బయలుదేరి వచ్చేశాను. బావున్నావురా అయ్యా?" అంది ప్రేమగా మునివేళ్ళతో రవీంద్ర బుగ్గలు పుణుకుతూ.

రవీంద్ర ఆపేక్షగా తల్లిని ముద్దుపెట్టుకున్నాడు.

"నీ దయవల్ల బాగానే వున్నానమ్మా"

"కోడలు పిల్లేదిరా? ఆఫీసుకెళ్ళిందా?"

"అవునమ్మా! ఇవాళ నాకు నైటుషిఫ్టు అందుకే ఇంట్లోవున్నాను. అన్నయ్యా, వదిన, పిల్లలు... అంతా కులాసాగా వున్నారా అమ్మా? అన్నయ్యతో చెప్పే వచ్చావా? లేక...చెప్పకుండా పోట్లాడి...."

సగం నవ్వుతో అర్థోక్తిగా చూశాడు తల్లికేసి.

సీతమ్మ మృదువుగా నవ్వింది.

"నాకెందుకురా వాడితో పోట్లాట? అన్నయ్యకీ, వదినకీ, పిల్లలకీ, అందరికీ చెప్పే వచ్చాను."

రవీంద్ర తల్లికేసి కినుకగా చూశాడు.

గారాలు పోతున్నట్లు తల్లి ఒడిలో వాలుతూ గోముగా అన్నాడు.

"అవునులే నీకు అన్నయ్య అంటేనే ఎక్కువ ఇష్టం. నీకు వాడితో అస్సలు పోట్లాట రాదు......"

సీతమ్మ వారింపుగా తన అరచేతిని మృదువుగా కొడుకు నోటి మీద అదిమింది.

మంద్రస్వరాన తనకి తను స్వగతం చెప్పకుంటున్నట్టు అంది.

"పిచ్చి నాయనా! వున్న ఇద్దరిలో ఎక్కువ తక్కువ లేమిట్రా? రెండు కళ్ళల్లో ఏకన్ను లేకపోయినా లోటే కదరా అయ్యా! తల్లిబిడ్డల మధ్య తగాదాలు శాశ్వతమా? నీమీద ప్రేమ వుండబట్టే ఒంట్లో ఓపిక లేక పోయినా ఇంత ఎండలో అంత దూరం నుంచి వచ్చాను నువ్వంటే ఏడాదిగా నన్ను చూడడానికి రాలేదు గానీ...ముసలిదాన్ని...నాప్రాణం వూరుకుంటుందా చెప్ప?"

సీతమ్మ మాటల్లో గూళ్ళుకట్టుకున్న ఆవేదన కదిలింది.

ఎండిన చెరువులో జలవూరినట్లు ఆవిడ కళ్ళనిండా నీళ్ళు నిండాయి.


"రాలనా?వద్దా" అన్నట్లు కన్నీరు మూసిన కనురెప్పలమాటున తళతళలాడింది.

తల్లి కన్నీరు చూడగానే రవీంద్ర నిలువునా కరిగినట్టు అయ్యాడు.

తల్లి రెండు చేతులు పట్టుకొని నచ్చచెపుతున్నట్టు అన్నాడు.

"కాదమ్మా! నాకు ఎందుకో ఈ మధ్య రోజూ నువ్వే జ్ఞాపకం వస్తున్నావు. నిన్ను చూడాలన్న కోరిక ఎక్కువైపోయిందమ్మా. నువ్వు నా మాట నమ్ముతావో లేదోగాని, నిన్ననే వారం రోజులు సెలవు కావాలని మా చీఫ్‌కి అప్లికేషన్ ఇచ్చాను. లీవు శాంక్షన్ కాంగానే నిన్ను చూడటానికి వద్దామనే అనుకుంటున్నానమ్మా........"


ఆ మాటతో సీతమ్మ ముఖంలో ఆనందం



"భార్య చనిపోయాక ఆ సుబ్బారావు ఎలా వుంటున్నాడు?"

"వాడికేం హాయిగా వుంటున్నాడు. ఇదివరకు ఇద్దరికి వంట చేయాల్సి వచ్చేది, ఇప్పుడు ఒక్కడే వంట చేసుకుని తింటున్నాడు."

— షేక్ కరీముల్లా (బాపట్ల)



తళుక్కున మెరిసి మాయం అయ్యింది.

వికసించిన వదనంతో తృప్తిగా కొడుకుకేసి చూస్తూ-

“ఒరేయ్ నాయనా! చాలా దాహంగావుందిరా నీచేత్తో గ్లాసుడు చల్లటి నీళ్ళు తెచ్చిపెట్టయ్యా!”

రవీంద్ర ఖంగు తిన్నట్టు అయ్యాడు.
చప్పున అరచేత్తో నుదుటి మీద కొట్టుకుంటూ-

“అయ్యో!మాటల్లో పడి మర్చిపొయ్యానమ్మా వుండు....”అంటు గభాలున లేచి వంటగదిలోకి వెళ్ళాడు. వాటర్ కూలర్ లోంచి నీళ్ళజగ్గు బయటికి తీసి, గ్లాసుపట్టుకొని డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చాడు.

కానీ-

అక్కడ సీతమ్మ లేదు.

“అరె!ఇంతలోనే ఎక్కడికి వెళ్ళింది?” అనుకుంటూ చుట్టూ కలయచూస్తూ “అమ్మా...”అని కేక పెట్టాడు.

“.................”

సమాధానం లేదు.

రవీంద్ర కళ్ళు అనుమానంతో ముడుచుకున్నాయి.

నీళ్ళ జగ్గు, గ్లాసు టీపాయ్ మీద పెట్టి టాయ్‌లెట్స్ వైపు వెళ్ళి తొంగి చూశాడు.

బాత్ రూమ్స్ తలుపులు తెరిచి వున్నాయి.

తల్లి అక్కడ కూడా కనిపించలేదు.

“అరె! ఇంతలోనే అమ్మ ఎక్కడికి వెళ్ళింది?” అనుకుంటు “అమ్మా.....అమ్మా.....”అని పిలుపు మీద పిలుపు వేస్తూ ఇల్లంత కలయ తిరిగాడు.

మూల మూలల వెదుకుతూ తల్లిని పిలిచాడు.

“అమ్మా” అన్న శబ్దంతో ఇల్లంతా మారు మ్రోగింది.

కానీ-

సీతమ్మ జాడ లేదు.

సోఫాలో పెట్టిన ఆవిడ సంచి కూడా లేదు.

ఎ.సి. కూడా తిరగటంలేదు.

ఆగిపోయింది.

అసలు ఒక మనిషి వచ్చి వెళ్ళిన అలికిడిగానీ ఆనవాలు గానీ లేదు!

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

రవీంద్ర గుండె ఒక్క క్షణం ఆగి,రెట్టింపు వేగంతో కొట్టుకోసాగింది.

ఒక సన్నని భయం వెన్నులో జరజరా పాకింది.

అనుమానంతో వీధి తలుపుల కేసి చూశాడు.

గెడియలు గట్టిగా బిగించి వేసినవి వేసినట్లే వున్నాయి.

రవీంద్ర విభ్రాంతిలో మునిగాడు.

అంతవరకూ చల్లగా వున్న వాతావరణం ఒక్కసారి వేడిగా అనిపించింది.

అతని నుదుటి నుంచీ ధారగా చెమటలు జారిపోసాగాయ్.

“అరె! ఇదేమి చిత్రం? మంచినీళ్ళు అడిగిన అమ్మ ఇంతలోనే ఎక్కడికి వెళ్ళింది? తను మేలుకొనే కలగన్నాడా? లేక కలలో మేలు కున్నాడా? నిజంగా అమ్మ వచ్చిందా? లేక అమ్మ మీద బెంగ పడటం చేత తను భ్రాంతి పడ్డాడా?........”

ఏదో సందిగ్ధత...................

అర్థం అయ్యీ అవని అయోమయంతో అలా ఎంత సేపు వుండిపొయ్యాడో తెలియదు.

ఒక రకమైన సుషుప్తి.

ఇంతలో-

ఎవరో వీపున ఛెళ్ళున చరిచినట్లు అయ్యింది.

మంచి నిద్రలో వున్న రవీంద్ర వులిక్కిపడ్డాడు.
నిద్రమత్తుతో మూసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతాన తెరిచాడు.

“సార్.....సార్.....
దబ్.....దబ్........మని తలుపు చప్పుడు.

సార్................సార్? పిలుపు మీద పిలుపు!

రవీంద్రకి నిద్ర మత్తు ఒదిలి చప్పున ఒంటిమీదకి స్పృహ వచ్చినట్లు అయింది.

గడియారం కేసి చూశాడు.

మధ్యాహ్నం.........

ఒంటిగంట సూచిస్తుంది.

“సార్.....సార్.....”గ[illegible]ంతో తలుపు మీద కొడుతూ గట్టిగా పిలుస్తుంటే “ఎస్. కమింగ్”అంటూ చప్పున మంచం దిగి వెళ్ళి గభాలున వీధి తలుపులు తెరిచాడు.

ఎదురుగా--

మిట్ట మధ్యాహ్నపు ఎర్రని ఎండలో

కాకి డ్రెస్‌లో మెసెంజర్.

బిత్తరపొయ్యాడు రవీంద్ర.

“ఎ....ఏ...మిటి?”

“రవీంద్ర కుమార్ అంటే మీరేనా?”

“అ.....అవు...ను......”

“ఇక్కడ సంతకం పెట్టండి మీకు టెలిగ్రాం ” అంటూ ఎర్రని కాగితం మడత అందించాడు.

ఒణికే చేతుల్తో సంతకం చేసి కాగితం మడత విప్పాడు రవీంద్ర.


“మదర్ ఎక్స్‌పైర్డ్ స్టార్ట్ ఇమీడియట్లీ ”- సురేంద్ర

అంతే!

గుండె గొంతుకలోకి వచ్చినట్టు-

“ అమ్మా ” అంటూ కేక పెట్టాడు రవీంద్ర. ఒక కొడుకు తల్లిని “అమ్మా” అంటూ ఎంత ప్రేమగా పిలవగలడో ....అంత ప్రేమాత రెండు అక్షరాల్లో నిండి దిగంతాలకి ప్రతిధ్వనించేలా “ అమ్మా....అమ్మా ” అంటూ ఆ గదిలో మారు మ్రోగింది.

---



అప్పులవాళ్ళ బారి నుండి తప్పించుకోవటానికి జైలుకు వెళ్ళావు కదా! ఎలా బయటికొచ్చావు?”

“అప్పు పెట్టిన వాడొకడు జామీన్ ఇచ్చి విడిపించాడు!”

షేక్ కరీముల్లా (బాపట్ల)